క్లుప్తంగా

మంత్రి సురేఖకు సన్మానం



నర్సంపేట రూరల్ : రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను సచివాలయంలో వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు నాడెం శాంతికుమార్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. తొలుత మంత్రికి శాలువా, మెమొంటో అందజేశారు. గజమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు బొల్లం శివ, గుండం శ్రీనివాస్, బనిశెట్టి లోకేష్, రాజశేఖర్, రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

గీసుకొండ: మంత్రి కొండా సురేఖను నాయకులు బొల్లం శివ, గట్టు జీవన్‌కుమార్, బొల్లం భిక్షపతి, గీసుకొండకు చెందిన దొడు భరత్, బండారి నరేశ్‌గౌడ్, దొడు ప్రవీణ్‌కుమార్, జావిద్, దొడు వినయ్ హైదరాబాద్‌లో కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిని, వారి కూతురు సుస్మితా పటేల్‌ను కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఈవీ.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అభినందనలు



చెన్నారావుపేట: మండలంలోని సూర్యాపేటతండాతోపాటు పలు గ్రామాలకు చెందిన గిరిజనులు, నాయకులు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని ఆదివారం కలిసి అభినందించారు. తొలుత వారు ఎమ్మెల్యేకు పూలబొకేలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాలతో సత్కరించి స్వీట్లు తినిపించారు. కార్యక్రమంలో నాయకులు భద్రు, రఘు, దేవేందర్, కొండా, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైని కలిసిన ఫర్టిలైజర్ అసోసియేషన్ సభ్యులు

చెన్నారావుపేట: కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై శ్రీనివాస్‌ను స్థానిక ఫర్టిలైజర్ అసోసియేషన్ సభ్యులు, కాంగ్రెస్ మండల నాయకులు ఆదివారం కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కుండె కుమారస్వామి, వీరయ్య, ననుమాన కరుణాకర్, అధ్యక్షుడు బుర్రి యాదగిరి, లింగాల సంతోష్, దశరథం, రహమాన్, సురేశ్, రామకృష్ణ, సూరన్న, రవీందర్, కమల్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ




పర్వతగిరి: మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన గీత కార్మికుడు ముంజాల సమ్మయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పట్టాపురం ఏకాంతంగౌడ్ ఆదివారం పరామర్శించారు. సమ్మయ్య మృతి బాధాకరమన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో సంఘం మండల అధ్యక్షుడు రంగు జనార్దన్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రంగు కుమారస్వామి, కల్లెడ సొసైటీ అధ్యక్షుడు తాళ్లపెల్లి సంపత్, సభ్యులు రంజిత్, సారంగపాణి, తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత



సంగెం: మండలంలోని ఎల్గూర్ రంగంపేట గ్రామానికి చెందిన తావుల సమ్మయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి యువ కానుక టీమ్ ఆదివారం 50 కేజీల బియ్యం సాయం అందజేసింది. కార్యక్రమంలో టీమ్ సభ్యులు అశోక్‌కుమార్, శంకర్, శ్రవణ్, సుమన్, రాజ్‌కుమార్ నాయకులు శ్రీనివాస్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం



చెన్నారావుపేట: మండల కేంద్రానికి చెందిన గొట్టి సూరమ్మ ఇటీవల పాముకాటుతో మృతి చెందగా బాధిత కుటుంబానికి ఆమె కొడుకు రాజు స్నేహితులు ఆదివారం రూ.8700లు సాయం అందజేశారు. కార్యక్రమంలో కెంచ ప్రవీణ్, పులిశేరు రాజేందర్, అన్న బీరయ్య, వల్ల వేణు, రానమల్ల సతీశ్, పైనాల రాజు, ఎర్ల రాజిరెడ్డి, నల్లతీగల శ్రీనివాస్, పులి రమేశ్, అల్లాడి స్వామి తదితరులు పాల్గొన్నారు.

పాడిరైతుల ఎదురుచూపు

- రెండు నెలలుగా బిల్లులు అందక వెతలు

దుగ్గొండి: వ్యవసాయానికి అనుబంధంగా రైతులు పాడి పరిశ్రమను ఎంచుకుంటున్న విషయం తెలిసిందే. ప్రకృతి వైపరీత్యాలు ఎదురై పండించిన పంటకు గిట్టుబాటు ధర రాకున్నా వ్యవసాయం కుంటుపడకుండా కుటుంబం సాఫీగా సాగిపోవడానికి పాడి ప్రయోజనకారిగా ఉంటుందన్నది జగమెరిగిన సత్యం. కాగా పాలు పోసి నెలలు గడుస్తున్నా బిల్లులు రాకపోవడంతో పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. బిల్లుల కోసం పాడి రైతుల ఎదురుచూపులు తప్పడం లేదు. మండలంలో 14 కేంద్రాల ద్వారా విజయ డెయిరీ పాలను సేకరిస్తోంది. గతంలో ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా దళిత రైతులకు సబ్సిడీపై గేదేలను అందించగా పశు సంపద పెరిగి పాడి లభ్యత ఎక్కువయ్యింది. నర్సంపేటలోని ప్రధాన కేంద్రం ద్వారా 56 కేంద్రాల నుంచి రోజుకు 3–4 వేల లీటర్ల పాలను సేకరిస్తున్నారు. మొత్తం 2460 మంది రైతులు పాలు పోస్తున్నారు. వీరికి 15 రోజులకోమారు బిల్లులు చెల్లించాల్సి ఉంది. అక్టోబర్ 15 నుంచి ఇప్పటివరకు 4 దఫాలుగా బిల్లులు రావడం లేదని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిల్లులు రాకపోవడంతో రోజువారీ ఖర్చులతోపాటు కుటుంబ పోషణ భారమౌతోందని పాడి రైతులు వాపోతున్నారు. పిల్లల ఫీజులు కూడా చెల్లించలేకపోతున్నామని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు.

పత్తాలేని ఇన్సెంటివ్..

పాడి రైతులను ప్రోత్సహించేలా నాటి ప్రభుత్వం ఆరేళ్ల క్రితం ఇన్సెంటివ్ విధానాన్ని ప్రవేశపెట్టింది. లీటరుకు రూ.4 చొప్పున అందించేలా ప్రణాళికలు రూపొందించింది. రైతుల నుంచి బ్యాంక్ ఖాతాలు సేకరించింది. ఇప్పటివరకు ఆరేళ్లు గడుస్తున్నా రైతులకు ఇన్సెంటివ్ ఇచ్చిన దాఖలాల్లేవు. ప్రస్తుతం గేదె పాలు పాయింట్‌కు రూ.7.50, ఆవు పాలకు రూ.13.50లు చెల్లిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి పాల బిల్లులు చెల్లించడంతోపాటు ఇన్సెంటివ్ అందించాలని పాడి రైతులు కోరుతున్నారు.



నాదినపల్లి కేంద్రంలో పాలు పోస్తున్న రైతులు

బిల్లులు రాక రెండు నెలలు



విజయ డెయిరీలో రోజు 4 లీటర్ల పాలు పోస్తున్నా. బిల్లులు అందక 2 నెలలు దాటింది. నాకు సుమారు రూ.15 వేలు రావాల్సి ఉంది. బిల్లులు చెల్లించి ఆదుకోవాలి.

–తానం రాజేశ్, పాడి రైతు, బిక్కాజిపల్లి

అయ్యప్పస్వామి ఆలయంలో పడిపూజ



సంగెం : పటం పూజలో అయ్యప్ప స్వాములు



నర్సంపేట: అన్నదానం ప్రారంభిస్తున్న దాతలు

నర్సంపేట: పట్టణంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ శింగిరికొండ మాధవ శంకర్‌గుప్తా ఆధ్వర్యంలో 23వ మండల పూజా మహోత్సవం, అన్నదాన కార్యక్రమం ఆదివారం కొనసాగాయి. అన్నదాతలు బస్వరాజు మానిక, తాబేటి రవి అశ్విని, బకరా సంపత్ రాధిక, తోట సాంబయ్య వనజ అయ్యప్ప స్వాములకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాదారపు చంద్రశేఖర్‌గుప్తా, దొడ్డ రవీందర్, శ్రీరాం ఈశ్వరయ్య, చింతల కమలాకర్‌రెడ్డి, శ్రీరాముల శంకరయ్య, భూపతి లక్ష్మినారాయణ, శింగిరికొండ వేణుగోపాల్, దొడ్డ వేణు, మల్యాల రాజు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అయ్యప్ప పటం పూజ

సంగెం: 'అయ్యప్ప శరణం.. స్వామియే శరణం..' నామస్మరణతో మండలంలోని గవిచర్ల గ్రామం ఆదివారం మార్మోయింది. గ్రామంలోని గుళ్లపల్లి ఉమేందర్ కుటీరంలో గురుస్వామి కొంతం యాదగిరి ఆధ్వర్యంలో పటం పూజ నిర్వహించారు. స్వాములు చేసిన అయ్యప్ప నామస్మరణ, శరణు ఘోషతో గ్రామంలో సందడి నెలకొంది. అయ్యప్ప స్వాములు పాడిన పాటలు మంత్రముగ్ధులను చేశాయి. అనంతరం స్వాములు భిక్ష నిర్వహించారు.

ముగిసిన ప్రతిష్ఠాపన మహోత్సవాలు



రామాలయంలో పూజ చేస్తున్న భక్తులు

ఖానాపురం: మండలంలోని అశోక్‌నగర్‌లో చేపట్టిన గోదా రంగనాథస్వామి పంచలోహ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. శ్రీ కోదండ రామాలయంలో మూడ్రోజులుగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టిన విషయం తెలిసిందే. చివరి రోజు సందర్భంగా శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ జీయర్ స్వామి పర్యవేక్షణలో పంచలోహ విగ్రహ ప్రతిష్ఠ, శాంతి కళ్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవనాథ జీయర్ మాట్లాడారు. విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలను వైభవంగా నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

నియామకం



నెక్కొండ: కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శిగా రెడ్లవాడ గ్రామానికి చెందిన గడుదాసు వేణుగోపాల్‌ను నియమించినట్లు మండల అధ్యక్షుడు బక్కి అశోక్ తెలిపారు. ఈ మేరకు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చేతుల మీదుగా వేణుగోపాల్ ఆదివారం నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడారు. పార్టీకి అంకిత భావంతో పని చేసి ఎమ్మెల్యే గెలుపు కోసం చేసిన కృషి ఫలితంగా వేణుగోపాల్‌ను నియమించామని చెప్పారు. వేణుగోపాల్‌ను నాయకులు, కార్యకర్తలు అభినందించారు. తన నియామకానికి సహకరించిన టీపీసీసీ సభ్యుడు పొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రావుల హరీశ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఆవుల చంద్రయ్యలకు వేణుగోపాల్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు దూదిమెట్ల కొమురయ్య, రాజు పాల్గొన్నారు.

పూరిగుడిసె దగ్ధం

నల్లబెల్లి: గుర్తు తెలియని వ్యక్తి నిప్పుపెట్టడంతో పూరిగుడిసె దగ్ధమైంది. మంటలను గమనించిన స్థానికులు ఇంట్లో నిద్రిస్తున్న వృద్ధుడిని ప్రాణాలతో కాపాడారు. ఈ ఘటన మండలంలోని రుద్రగూడెం గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన శీలం బాలమల్లు భార్య ఇటీవల కూతురు ఇంటికి వెళ్లగా ఆయన ఇంట్లో ఒక్కడే నిద్రపోయాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తి బాలమల్లు పూరిగుడిసెకు నిప్పుపెట్టాడు. దీంతో బాలమల్లు ఇంటికి మంటలు వ్యాపించాయి. స్థానికులు అయన్ను ప్రాణాలతో కాపాడారు. స్థానికులు మోటర్ సాయంతో నీళ్లు చల్లి మంటలు ఆర్పారు. పూరిగుడిసె పూర్తిగా దగ్ధమైంది.

చదువులమ్మ ఒడికి చేర్చేలా..

- బడిబయట పిల్లల సర్వే చేపడుతున్న సీఆర్పీలు



శంకర్‌తండాలో సర్వే చేస్తున్న సీఆర్పీ రమాదేవి

పెద్దవంగర: బాలల భవితకు చదువు బాసటగా నిలిచేలా ప్రతి ఏటా విద్యాశాఖ పలు కార్యక్రమాలు చేపట్టుతుంది. బడీడు పిల్లలు పాఠశాలలకు వెళ్లకుండా పనులకు వెళ్తున్న పిల్లలను, చాలా రోజులుగా బడికి హాజరుకాని పిల్లలతో పాటు బుద్ధిమాంద్యంతో ఇబ్బంది పడుతున్న ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించి సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రతి ఏడాది బడి బయట పిల్లల సర్వే చేపట్టుతుంది. అందులో భాగంగా 2024–25 విద్యా సంవత్సరం కోసం నిర్వహించే సర్వే గత సోమవారం నుంచి వచ్చే నెల 10 వరకు కొనసాగనుంది.

నెల రోజులపాటు సర్వే..

మండలంలోని చిట్యాల, పెద్దవంగర క్లస్టర్ పరిధిలోని 20 గ్రామ పంచాయతీల్లోని పాఠశాల స్థాయిలో 6 నుంచి 14 ఏళ్ల పిల్లలను, కళాశాల స్థాయిలో 15 నుంచి 19 ఏళ్ల పిల్లలను వేర్వేరుగా గుర్తిస్తున్నారు. ప్రతి ఇంట్లో, పని ప్రదేశాల్లో బడిమానేసిన పిల్లల వివరాలను సేకరించి విద్యార్థి అభ్యాస సామర్థ్యం, వయస్సును పరిగణనలోకి తీసుకొని నిర్దేశిత తరగతుల్లో చేర్పించడం, దూర విద్యలో ప్రవేశాలు కల్పించడం వంటివి సీఆర్పీలు (క్లస్టర్ రిసోర్స్ పర్సన్) చేస్తున్నారు. బుద్ధిమాంద్యం పిల్లల వివరాలను ఐఈఆర్పీలు (ఇన్‌క్లూసివ్ ఎడ్యూకేషన్ రిసోర్స్ పర్సన్) సేకరిస్తున్నారు. సర్వేలో గుర్తించిన వివరాలను ప్రబంధ్ పోర్టల్‌లో, దివ్యాంగు పిల్లల వివరాలను సీడబ్ల్యూఎస్ఎన్ పోర్టల్ నమోదు చేస్తున్నారు.

'అమాట్' పరీక్షకు స్పందన



వర్ధన్నపేట: ఆల్ఫోర్స్ మ్యాథ్స్ ఒలంపియాడ్ టెస్ట్ (అమాట్)కు స్పందన లభించిందని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. మండలంలో ఆదివారం నిర్వహించిన అమాట్ పరీక్షకు ఆయన హాజరై మాట్లాడారు. రామనుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు గణిత శాస్త్రంపై మక్కువ పెంచుకుని రామనుజన్ ఆశయాలకు అనుగుణంగా, అయన నిర్దేశించిన మార్గదర్శకాలను పాటిస్తూ నూతన విషయాలు తెలుసుకోవాలని సూచించారు. అమాట్ పరీక్ష రాసిన విద్యార్థుల్లో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన వారికి ఈనెల 22న బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, టీచర్లు పాల్గొన్నారు.

ఇసుక లారీ ఓనర్ల సమస్యలు పరిష్కరించాలి

ఖిలా వరంగల్: ఇసుక లారీ ఓనర్ల పార్కింగ్ అడ్డా సమస్యను పరిష్కరించాలని వరంగల్ ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధి సీహెచ్ శ్రీనివాస్, సభ్యులు కోరారు. ఈమేరకు వర్ధన్నపేట నియోజకవర్గంలో ఆదివారం పర్యటిస్తున్న ఎమ్మెల్యే నాగరాజును లారీ ఓనర్లతో కలిసి ఎమ్మెల్యే నాగరాజును అసోసియేషన్ ప్రతినిధులు కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇసుక లారీ అడ్డా పార్కింగ్ సమస్యలను పరిష్కరించాలని, అక్రమంగా ఇసుక విక్రయాలు జరిపే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. తమకు అన్ని రకాల అనుమతులున్నా అధికారులతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఇసుక లారీ ఓనర్లు మహేష్, ఓదేలు, శివ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

దామెర : నేడు(సోమవారం) నిర్వహించనున్న బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము ఆదివారం ప్రకటనలో కోరారు. దామెర మండల కేంద్రం సమీపంలోని ఏఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో సోమవారం ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం కానున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరు కానున్నట్లు వెల్లడించారు. కాగా సమావేశానికి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మార్కెట్‌లో పెన్షనర్స్ డే

వరంగల్: వరంగల్ లక్ష్మీపురం పాత కూరగాయల మార్కెట్‌లోని యూనియన్ భవనంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగపురి సారయ్య అధ్యక్షతన విశ్రాంత ఉద్యోగుల దినోత్సవం 'పెన్షనర్స్ డే'ను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పెన్షనర్స్ డేలో ఉమ్మడి జిల్లాలో ఉన్న మార్కెట్ కమిటీల చెందిన 100మంది సర్వీస్ పెన్షనర్లు, 50 మంది ఫ్యామిలీ పెన్షనర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన టీఎస్టీఓ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాంకిషన్, వేణుగోపాల్ హాజరై మాట్లాడారు. అనంతరం 75ఏళ్ల వయస్సు దాటిన 12 పెన్షనర్లను సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సత్యనాథ్, అశోక్, శివకుమార్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ మండల అధ్యక్షుడిగా కృష్ణ

గూడూరు: మండల కేంద్రానికి చెందిన తంగెళ్లపల్లి కృష్ణ ఆటో యూనియన్ మండల అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బానోతు హరి, ప్రధాన కార్యదర్శిగా దుర్గాల సోమశేఖర్, ఉపాధ్యక్షులుగా అజీజ్, రవూఫ్, కోశాధికారిగా నవీన్, సహాయ కార్యదర్శిగా సాంబయ్య, సభ్యులుగా సోమ నర్సయ్య, పొన్నం నర్సయ్య, సాంబయ్య ఎన్నికయ్యారు.

'బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి'

ఖిలా వరంగల్: ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు సూచించారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ జిల్లా కార్యాలయం తమ్మెర భవనంలో తాళ్లపెల్లి రహేలా అధ్యక్షతన జిల్లా సమితి సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన నిరంకుశ పాలకులను గద్దెదించిన విధంగానే కేంద్రంలోనూ మోదీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని అన్నారు. మోదీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేశారని, పెట్టుబడిదారి, కార్పొరేటర్ శక్తులకు ప్రభుత్వ సంపదను ధారాదత్తం చేశారని ఆరోపించారు. ఈనెల 26న సీపీఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నగరం, గ్రామాల్లో ఎర్ర జెండాలు ఎగరవేయాలని అయన కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి, సహాయ కార్యదర్శి మేకల రవి, షేక్ బాషుమియా, పంజాల రమేష్, రవీందర్, గన్నారపు రమేష్, చంద్రకళ, శంకరయ్య, ఎలేందర్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థులకు పతకాలు



పతకాలు, సర్టిఫికెట్లతో విద్యార్థులు

నర్సంపేట: కాజీపేటలోని వాసవి కళ్యాణ మండపంలో ఓరుగల్లు డ్రాగన్ స్కూల్ ఆఫ్ జపాన్ కరాటే సంస్థ ఆదివారం నిర్వహించిన 3వ జాతీయ స్థాయి పోటీల్లో నర్సంపేట పట్టణానికి చెందిన షోటోఖాన్ జపాన్ కరాటే డూ ఇండియా హంబు సంస్థ విద్యార్థులు ప్రతిభ చాటి నాలుగు బంగారు, ఒక వెండి పతకం సాధించినట్లు సంస్థ టెక్నికల్ డైరెక్టర్ షిహాన్ రచ్చ భవానీచంద్ బ్లాక్ బెల్ట్ 5వ డాన్ తెలిపారు. తొమ్మిదేళ్ల బాలికల విభాగంలో కటా విభాగంలో తపస్వి బంగారు పతకం, బాలుర విభాగంలో సుభాన్ వెండి పతకాలు సాధించినట్లు చెప్పారు. అలాగే 13 ఏళ్ల విభాగంలో ఎల్లో బెల్ట్ బాలుర కటా విభాగంలో గురుచరణ్ బంగారు పతకం, 14 ఏళ్ల సీనియర్ బ్రౌన్ బెల్ట్ కుమితేలో రాంచరణ్ బంగారు పతకం, 16 ఏళ్ల బాలుర విభాగంలో రిషిత్ కటాలో బంగారు పతకం సాధించినట్లు వివరించారు. సంస్థ ఇండియా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ అండ్ ఎగ్జామినర్ షిహాన్ రచ్చ శ్రీను బాబు బ్లాక్ బెల్ట్ 7వ డాన్ జపాన్ డిప్లమా విద్యార్థులను అభినందించారు.

చైతన్యంతోనే ఉత్తమ పౌరులుగా ఎదుగుదల



విద్యార్థులతో డాక్టర్ శ్రీనివాస్, తేజస్వి, ఇతరులు

నర్సంపేట రూరల్ : చైతన్యం పెంచుకోవడం ద్వారానే బాలలు ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని డాక్టర్ గంగెట్టి శ్రీనివాస్, సంఘమిత్ర అడ్వైజర్ హన్మంతరావు తెలిపారు. నర్సంపేట పట్టణంలోని సంఘమిత్ర బాల భవన్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా సంఘమిత్ర యూత్ ఆర్గనైజేషన్ సెక్రెటరీ అలువాల తేజస్వి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో శ్రీనివాస్, హన్మంతరావు హాజరై మాట్లాడారు. బాలల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, దాతల సహకారంతో చిన్న మొత్తాలను సేకరించి ఆర్థిక భారానికి, శ్రమకు ఓర్చి ముందుకు నడుస్తున్న సంఘమిత్ర సభ్యులకు అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే దిశగా పాటుపడాలని ఆకాంక్షించారు. పోటీల్లో ప్రతిభ చాటి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘమిత్ర యూత్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గొంగళ్ల అశోక్, సభ్యులు రాయబోస్, ఉమామహేశ్వర్, బాబర్, తోట రవి, రాణి, తేజస్వి, సిద్దార్థ తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు న్యాయం చేయాలి



చెన్నారావుపేట : నిరసన తెలుపుతున్న ఆటోడ్రైవర్లు, నాయకులు

చెన్నారావుపేట: ఆటోడ్రైవర్లకు న్యాయం చేయాలని ఆటో యూనియన్ అధ్యక్షుడు గుర్రపు భిక్షపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఆటోలతో నిరసనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన రోడ్డుపై రాస్తారోకో చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడారు. ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడంతో ఆటో డ్రైవర్లు రోడ్డున పడ్డట్లు తెలిపారు. ఆటోడ్రైవర్లకు న్యాయం చేసేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పైనాల రాజేశ్, కందిక శేఖర్, జంగిలి సదయ్య, బండారి సత్యం, వంగవండ్ల చిన్నరాజు, దుండి రంజిత్, గాండ్ల రాజేందర్, శివ, రవి, శోభన్, అనిల్, సంపత్, భిక్షపతి, ఉపేందర్, భాషా, రమేశ్, సారయ్య, కుమారస్వామి, రాజు పాల్గొన్నారు.

నిరసన ర్యాలీ

ఖానాపురం: మండలంలోని బుధరావుపేటలో ఆటోడ్రైవర్‌లు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ ఆటో యూనియన్ అధ్యక్షుడు పసునూరి వెంకటేశ్వర్లు మాట్లాడారు. మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తుండడంతో తమ ఉపాధికి దెబ్బ పడిందన్నారు. ఆటోడ్రైవర్లు కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఆటోడ్రైవర్ల ఇబ్బందులను ప్రభుత్వం గమనించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాజు, ప్రభాకర్, యాక వీరేంద్రం, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

'ఆత్మహత్యతో కుటుంబ సభ్యులకు క్షోభ'



ఆత్మహత్య నివారణపై ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

గూడూరు: మనిషి జన్మ జీవించడానికే తప్ప, కష్టాలు ఎదురైనప్పుడు ఆత్మహత్యకు పాల్పడడానికి కాదని, జీవితం జీవించడానికేనని ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి డాక్టర్ పరికివండ్ల అశోక్ అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఆదివారం ఆత్మహత్యల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒంటరి జీవితంలోకి వెళ్లిన వారు తనకు ఎవరూ లేరని ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. వారి కుటుంబ సభ్యుల మనోవేదన అర్థం చేసుకునే వారెవరని, వారి మరణంతో కుటుంబ సభ్యులు క్షోభకు గురవుతారని, ఆత్మహత్యలకు పాల్పడవద్దని తెలిపారు. ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ పది సంవత్సరాలుగా ఆత్మహత్యల నివారణపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి వెంగంటి శుభ, సహజ, ఉపాధ్యాయులు రజిత, సునీత, అనిత, దీపిక పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు



ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి స్వయంభూ లక్ష్మినృసింహస్వామి ఆలయంలో ధనుర్మాస వేడుకలను ఆదివారం ప్రారంభించారు. ఆలయంలో ఉదయం నిత్య పూజలు, గోదా, కృష్ణుడి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి అలంకరించారు. గోదా అమ్మవారు స్వయంగా తమిళంలో విరచించిన ముప్పై పాశురములతో కూడిన తిరుప్పావైని అర్చకులు పఠించారు. అనంతరం మొదటి రెండు పాశురములను భక్తులచే పారాయణం చేయించారు. గోదాకృష్ణులకు అష్టోత్తర శతనామార్చన నిర్వహించి స్తంభ నారసింహుడుని అభిషేకించారు. ఈ సందర్భంగా అర్చకులు ధనుర్మాస విశిష్టత, గోదా అమ్మవారు, కాత్యాయని వ్రతం గురించి భక్తులకు వివరించారు. ధనుర్మాస వ్రతం ఎలా చేయాలి దాని వల్ల కలుగు ప్రయోజనాలను ప్రవచించారు. సాయంత్రం ఆలయంలో విష్ణు సహస్ర నామ పారాయణ కావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.